## కారుతో సహా ఎర్రచందనం స్వాధీనం

భాకరాపేట, జూలై 27 ప్రభాతవార్త



భాకరాపటే అటవీ సిబ్బంది శనివారం కారుతో సహా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట అటవీ రేంజ్ అధికారి ఎం.దత్తాత్రేయ తెలిపారు. వారికి రాబడిన సమాచారం మేరకు శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో నాగపట్ల ఈస్ట్ బీటు వద్ద అటవీ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేయసాగారు. ఓ కారులో సుమారు నాలుగు లక్షల విలువగల 11 ఎర్రచందనం దుంగలు కనపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ తనిఖీలలో డీవైఆర్ఓ వేణు, ఎఫ్‌బీఓలు రవి, రెడ్డెప్పరెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## మూషిక వాహనంపై దర్శనమిచ్చిన విఘ్నేశ్వరుడు

పాకాల, జులై 27, ప్రభాతవార్త

పాకాల మండలం ఊట్లవారిపల్లె గ్రామం ఆనందగిరి కొండపై వెలసి వున్న శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్యేశ్వర స్వామి ఆడికృత్తిక మహోత్సవంలో భాగంగా మూషిక వాహనం పై వినాయక స్వామిని ప్రతిష్టించారు. శనివారం ఆలయ ఈవో ఎస్. యువరాణి, చైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం మేళతాళాలు మంగళవాయిద్యాలతో నడుమ పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, పురప్రజలు పెద్ద ఎత్తున తమ మొక్కులు చెల్లించుకున్నారు.



# ట్రాలీలారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

### యువతి మృతి - నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన ఝాన్సీ రాణి, ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన బస్సు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న డిఎస్పి, ఆర్డిఓ

చిల్లకూరు, జులై 27, ప్రభాతవార్త

మండల పరిధిలోని వరగలి క్రాస్ రోడ్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఆగి ఉన్న ట్రాలీలారీని సూళ్లూరుపేట ఆర్టీసి పల్లె వెలుగు బస్సు వెనక నుండి ఢీకొంది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే చిల్లకూరు ఎస్ఐ సుధీర్ కుమార్ సీఐ వేణుగోపాల్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి సూర్యనారాయణ రెడ్డి, ఆర్‌డివో కిరణ్ కుమార్‌లు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని ప్రమాదంలో గాయపడిన వారిని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ శనివారం ఉదయం సూళ్లూరుపేట డిపోకు చెందిన పల్లె వెలుగు ఆర్టీసి బస్సు 32 మంది ప్రయాణికులతో నెల్లూరుకి వస్తున్న క్రమంలో వరగలి క్రాస్ రోడ్ సమీపంలో జాతీయ రహదారి పై ఆగి ఉన్న ట్రాలీ లారీని ఢీకనడం జరిగింది. ఈ ప్రమాదంలో తిరువల్లూరు జిల్లా ఊతుకోట మండలం ఎస్ఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన ఝాన్సీరాణి (24) అనే మహిళ అక్కడ మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన సి. కుమారి, అబ్దుల్ రాపూర్, దొడ్డి పోలయ్య ఊటుకూరు మన్మథ కుమార్‌లను చికిత్స నిమిత్తం నెల్లూరు జిజిహెచ్ హాస్పిటల్‌కి తరలించడం మెరుగైన వైద్యం అందిస్తున్నారు. స్వల్పంగా గాయపడిన భక్తవత్సలు, భక్తాచలం, గొల్ల చిన్నయ్య, శంకర్, ఎస్ మనీషా, ఎస్. మధుబాల, ఎస్ రూబీన్, గంజి రమణయ్య, పాలమణి ప్రవీణ్, కోటేశ్వరి, అనార్కలి, కండక్టర్ ఎండి నిషాద్ అహ్మద్ స్వల్ప గాయాలు కావడంతో వారిని గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే గూడూరు ప్రాంతీయ వైద్యశాల ఉన్న వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో పూర్తిగా సూళ్లూరుపేట డిపోకు చెందిన డ్రైవర్ కేశవమణి అజాగ్రత్త వల్లే జరిగింది. మున్సిపల్ కమిషనర్ మల్లవరపు వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ సమీరా వైద్య సిబ్బంది ఉన్నారు.

## రావణాసుర వాహనంపై కుమారస్వామి విహారం

శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త



.రావణాసుర వాహనంపై భక్తులకు దర్శనం ఇస్తున్న కార్తీకేయుడు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులకు శ్రీకాళహస్తీశ్వరాలయంలో సరా ్వంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపి హారతులిచ్చారు. అనంతరం స్వామివారిని రావణాసుర వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు బారులుతీరారు. ఉత్సవం ముందు మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమకొనసాగింది. పలువురు భక్తులు స్వామి అమ్మవార్లకు హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాధికారులు, ఉభయదారులు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో శ్రీవల్లిదేవసేన సమేత చెంగల్వరాయ స్వామి



## పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం

### - ప్రతి 3 నెలలకోసారి వీరికి మెడికల్ క్యాంపులు : కలెక్టర్ సుమిత్‌కుమార్



సఫాయి కర్మచారి సమావేశంలో సభ్యులు, అధికారులతో సమావేశమైన కలెక్టర్ సుమిత్‌కుమార్.

చిత్తూరు, జులై 27 ప్రభాతవార్త: కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డిసిహెచ్‌ఎస్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని సమావేశమందిరంలో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన సఫాయి కర్మచారి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా వుంచడంలో పారిశుధ్య కార్మికులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, వీరికి పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించడంలో మున్సిపల్ కమీషనర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు బాధ్యతగా వుండాలన్నారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డిసిహెచ్‌ఎస్ డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మున్సిపాల్టీల పరిధిలో నిపుణులైన వైద్య బృందాల ద్వారా ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపులు నిర్వహించి కార్మికులకు షుగర్, బిపీ, రక్తపరీక్షలు, డెంగ్యూ, కంటి పరీక్షలు నిర్వహించాలని, అలాగే మద్యానికి బానిసలైన వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలని ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్లు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని సచివాలయ పరిధిలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ల ద్వారా పారిశుధ్య కార్మికులతో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, పిఎం జీవన జ్యోతి, యువజన పథకాల కింద నమోదు చేయాలని, ప్రమాద సమయాల్లో ఈ పథకాలు కార్మికులకు ఆసరాగా వుంటుందన్నారు. అలాగే ప్రమాద, అనారోగ్య సమయాల్లో కార్మికులకు సంబంధించిన బీమా మొత్తంను ఇన్సురెన్స్ కంపెనీల నుండి ఇప్పించే బాధ్యత మున్సిపల్ కమీషనర్లు తీసుకోవాలని ఆదేశించారు. కార్మికుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించి ప్రైవేటు ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సదుపాయాల సమాచారంను సేకరించాలన్నారు.

## ఎన్నికల కమీషన్‌ను ఏమార్చిన పెద్దిరెడ్డి ఎన్నిక చెల్లదు



విలేకరులతో మాట్లాడుతున్న బిసివై నేత బోడే రామచంద్రయాదవ్

### - చూపని 142 ఆస్తులపై బోడేరామచంద్రయాదవ్ సవాల్
### - పెద్దిరెడ్డి ఆఫ్రికా వ్యాపారాలపై విచారణకు డిమాండ్

పుంగనూరు, జూలై 27 ప్రభాతవార్త :

దేశ ఎన్నికల కమీషన్‌ను పుంగనూరు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తప్పుదోవపట్టించారని, దీనిపై వెంటనే భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారతచైతన్య యువజన పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ కోరారు. ఈమేరకు ఆయన పుంగనూరులో తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పవిత్రమైన భారత ఎన్నికల వ్యవస్థకు తప్పుడు అఫిడవిట్ సమర్పించడం, తనకు చెందిన 142 ఆస్తుల సమాచారాన్ని చూపించక కమీషన్‌ను తప్పుదోవ పట్టిండచానికి పెద్దిరెడ్డి ప్రయత్నించారన్నారు. హైకోర్టులో విచారణలో ఉన్న ఈకేసులో పెద్దిరెడ్డి ఎన్నికల చెల్లబోదని తీర్పురావాలని ఆశించారు. దీనిపై సమగ్రమైన వివరాలు, ఖచ్చితమైన ఆధారాలతో హైకోర్టులో పిటీషన్‌దాఖలు చేయగా ఈనెల 31 విచారణ జరగబోతోందన్నారు. ఈ 142 ఆస్తులు పెద్దిరెడ్డి కుటుంబం సాగించిన భూదందాలో ఒక్కశాతం మాత్రమే ఉంటుందన్నారు. ఈ 142 ఆస్తులను చూపించక తప్పుదోవ పటి ్టంచాలని చూసిన పెద్దిరెడ్డి ఎన్నిక చెల్లదని తీర్పురావాలన్నారు. అయితే 142 ఆస్తులలో ఏఒక్కటీ తనది కాదని పెద్దిరెడ్డి నిరూపిస్తే, తన రాజకీయ పార్టీను రద్దుచేస్తాననని, తాను వేసిన ఈకేసు ఉపసంహరించుకుంటనన్నారు. ఇన్ని అరాచకాలు, దోపిదీలు చేసిన తరువాత కూడా జగన్ ప్రభుత్వానికి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేస్తే జగన్ కోర్టుకువెళ్ళి ప్రతిపక్ష హోదా కావాలని కోరడం సిగ్గుచేటన్నారు. వెయ్యి ఎలుకలుతిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్ళినట్లు జగన్ చిన్న సంఘటనలు అడ్డుపెట్టుకుని ఓదార్పుయాత్రాలు చేయాలనుకోవడం విచాకరమన్నారు.

## కుమారస్వామి ఆలయంలో ఏర్పాట్లపై ఇఓ సమీక్ష



శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, అనుబంధ ఆలయమైన విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా శనివారం ఆలయ ఇఓ ఎన్‌వియన్ ఎన్ మూర్తి తన సహాచర ఉద్యోగులు, సిబ్బందితో కలసి ఏర్పాట్లును సమీక్షించారు. ఆలయానికి వస్తున్న భక్తులతో చర్చించారు. నారదపుష్కరిణిలో కొత్తగా వదలిన నీటిలో ఆలంను కలపాలని సూచించారు. మెట్లపై భక్తులు కర్పూరం వెలగించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేలాది మంది తరలివచ్చే ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకొనుటకు ఇఓ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. ఆదివారం భరణి, ఆడికృత్తికకు హాజరయ్యే భక్తులకు సుదర్శనం ఇతర సదుపాయాల కల్పనలో ఆలయాధికారులు తీసుకన్న ఏర్పాట్లకు సంబంధించి సమీక్షించారు.

## లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు

### కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి కార్పొరేషన్, జులై 27, ప్రభాతవార్త

జూలై మాసపు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్‌లు సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే ఆగష్టు 1న ఉదయం ఆరు గంటల నుండి పంపిణీ చేయనున్నట్లు, సాంకేతిక కారణాల వలన మిగిలిపోయిన వారికి 2వ తేదిలో పంపిణీ చేయనున్నట్లు తెలుపుతూ లబ్ధిదారులు 1వ తేదిన వారి ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 267772 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 113.17 కోట్లు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలకు, మత్స్యకారులకు, హెచ్ఐవి వ్యాధి గ్రస్తులకు, చర్మకారులకు, హిజ్రాలకు, డప్పు కళాకారులకు రూ. 3 వేలు నుండి రూ. 4 వేల వరకు పెంచడమైందని, అలాగే వికలాంగుల పెన్షన్‌లు రూ. 3 వేల నుండి 6 వేల వరకు పెంచడమైందని, డిఎంహెచ్ఓ పెన్షన్‌ల రూ. 5 వేల నుండి 10 వేల వరకు పెంచడమైందని, ఇందులో శాశ్వత వికాంగులకు రూ. 5 వేల నుండి 15000 వరకు పెంచడమైందని తెలిపారు.

## అక్రమ నాటు తుపాకీ కలిగిన ఇద్దరు అరెస్టు

నారాయణవనం, జూలై 27 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనంకు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమ నాటు తు పాకీని కలిగి వుండడంతో అరెస్టు చేసినట్టు పుత్తూరు రూరల్ సిఐ భాస్కర్‌నాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణలు తెలిపారు. శనివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ముద్దాయిల అరె స్టు చూపించారు. వివరాలు ఇలా వున్నా యి. నారాయణవనం మేజర్ పంచాయతీ దిగువగాండ్ల వీధికి చెందిన లేట్ టి వెంక టేశరెడ్డి తనయుడు టి గోపిరెడ్డి అలియాస్ నాగరాజు(45), మట్టవారి వీధికి చెందిన ఎం దొరస్వామి తనయుడు ఎం శ్రీనివాసులు అలియాస్ శ్రీను(55)లను అరెస్టు చేశారు. వీరు ఎలాంటి లైసెన్స్ లేని ఎస్‌బిఎంఎల్-గన్‌ను తమ వద్ద వుంచుకొని చుట్టు పక్క అటవీ ప్రాంతాల్లో జీవాలపై దాడులు చేసి వాటిని తీసుకొచ్చి నారాయణవనంలో అమ్మి సొమ్ము చేసుకొని జల్సా చేసేవారు. అధికంగా అడవిపందులను వేటాడేవారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 1.30గంటలకు నాగిలేరు అడివిలో గల జవుకమిట్ట వద్ద పోలీసులను చూసి పోయారని, వెంటనే వారిని పట్టుకొని విచారించగా నిజం బయటపడిందన్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు నాటు తుపాకీని స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. సిబ్బందిని పుత్తూరు డిఎస్పీ శ్రీనివాసరావు, పుత్తూరు రూరల్ సిఐ భాస్కర్‌నాయక్ అభినందించారు.

## ఆన్‌లైన్ యాప్ మోసంపై ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు

*పలమనేరు, జూలై 27, ప్రభాతవార్త:*

*ఆన్‌లైన్ యాప్ మోసంపై బాధితులు శనివవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ను ఆశ్రయించారు. గత వారం రోజు లుగా ఓ ఆన్‌లైన్ యాప్ ద్వారా అధిక ఆదాయం వస్తుందని ఆశపడి ఆ యాప్‌లో నగదు జమచేసిన వా రికి ఆ యాప్ నిర్వహకులు ఒక్క సారిగా బోర్డుతిప్పేయడంతో పలమ నేరులోని బాధితులు తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్య పై మెప్మా పిడీతో చరవాణిలో మాట్లాడుతూ సిబ్బంది ఇలాంటి చర్యలకు పాల్పడుతుంటే ఉన్నతాధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం సరికాదని తెలిపారు. మెప్మా కార్యాలయం ప్రధానంగా ఈ యాప్ నిర్వహణ జరిగిందని, సిబ్బంది ఆర్‌పీలుకు గ్రూపు సభ్యులకు ఈ యాప్‌ను వివరిస్తు యాప్‌ను చరవాణిలో నమోదు చేపట్టారని బాధితులు ఆరోపిస్తున్నారని, స్థానిక కార్యాలయంలో విచారణ చేపట్టి బాధితులకు తగున్యాయం చేయాలని పిడికి సూచించారు.*

## గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ మృతి

నింద్ర, జులై 27 ప్రభాతవార్త



ఉమ్మడి చిత్తూరు జిల్లా టిడిపి మాజీ అధ్యక్షుడు, ఎస్వీ షుగర్స్ చైర్మన్, నగరి నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకుడు గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్ మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న ఆయన శనివారం రాత్రి తుది శ్వాస వదిలారు. టిడిపి పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ పునరుత్తేజానికి అవిరాళంగా కృషిచేసిన ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని పలువురు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఆయన స్వగ్రామం నింద్ర మండలంలో ఉన్నప్పటికీ పిచ్చాటూరు రాజకీయాల్లో 1986 దశంలో అరుణ అతిథిగృహం కేంద్రంగా రాజకీయ చతురత చాటుకుని చక్రం తిప్పారు.

## ఆడికృత్తిక మహోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం

### - కార్వేటినగరంలో తెపోత్సవానికి స్కంద పుష్కరిణి ముస్తాబు

కార్వేటినగరం, జూలై 27 ప్రభాతవార్త :

కార్వేటినగరం కోమరగిరి పే వేలసియుండు శ్రీవల్లి దేవయాని సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి వారి ఆడికృతిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్దం చేసున్నట్లు ఇవో ఏ. కృష్ణనాయక్ తెలిపారు. శనివారం ఆడికృతిక సందర్భంగా అంకురార్పణం, గణపతి హోమమం పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆధివారం భరణి కృతిక జరగనుంది. 29,30,31 తేదిలలో ఆడికృతిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు తమిళనాడు, పాలసముద్రం, ఎస్ఆర్.పురం, రామచంద్రాపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల నుంచి వేలది మంది భక్తులు ఆలయానికి చేరుకోనున్నారు. రానున్న భక్తులను అదుపు చేయడంకు బారికేడ్లులు ఏర్పాటు చేశారు. తలనీలాలు, కావడిలు చెల్లించే వారికి స్కంద పుష్కరిణిలో జలాలు పుష్కలంగా ఉందన్నారు. ఆలయానికి చేరుకునే భక్తులకు అన్నదాన సౌకర్యం కూడా ఉంటుందన్నారు. 28న పద్మసరస్సు 29నతూర్పు శివాలయం గిరిజన కాలనీ, 30న చింతోపు గిరిజన కాలనీ వాసులు అమ్మవారికి సారే తీసుకెళ్ళనున్నారు. మూడు రోజుల పాటు స్కందపుష్కరిణిలో తోపోత్సవం జరగనుందన్నారు. కావడిలు, తలనీలాలు సమర్పించే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నాట్టు తెలిపారు.





## మొక్కలు మాత్రమే ఆక్సిజన్‌ను అందించగలవు

సదుం, జూలై 27ప్రభాతవార్త

పర్యావరణంలోని అనేక జీవరాసుల్లో మొక్కలు మాత్రమే ఆక్సిజన్‌ను అందించగలవని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో పుంగనూరు అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్లాంట్ ఫర్ మదర్ ఎర్త్ అనే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సపోటా, బాదం,జామ, ఉసిరి తదితర మొక్కలను నాటి నీరుపోశారు.మొక్కల యొక్క ప్రాధాన్యతను ఆయనవివరించారు.అటవీసిబ్బందిమహేష్, షాజహాన్,చిన్నయ్య,రమణ,సిద్దయ్యవిద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై సంయుక్త పోరాటం

–జిల్లా అధ్యక్షుడు శివయ్య

పుంగనూరు, జూలై 27 ప్రభాతవార్త :

జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వంలో పనిచేస్తున్న అన్ని రకాల ఉద్యోగుల,పెన్షనర్ల సమస్యలపై ఉమ్మడిగా పోరాడేందుకు ఎప్పటికైనా సిద్దంగా ఉంటామని,పోరాట స్ఫూర్తితో అందరూ సమైక్యం కావాలని జిల్లా ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శివయ్య పిలుపునిచ్చారు. పుంగనూరు తాలూకా ఉద్యోగుల సంఘ ఎన్నికలు శనివారం జిల్లా సంఘ అధ్యక్షడు శివయ్య,గంగాధరంల అధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగాయి. తాలూకా సంఘ అధ్యక్షుడుగా ఇరిగేషన్ ఏఇ బాబూ రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా బి.మధు బాల, కోశాధికారిగా అమర్‌నాథ్‌లు నియమితులయ్యారు.సహాధ్యక్షుడుగా నాగేనాయక్,సహ ఉపాధ్యక్షులుగా నజీర్‌తాజ్,డాక్టర్‌మనోహర్,చంద్రయ్య,వాణి,పాండురంగ,గ్లోరీసుధారాణి,విసి మంజులలు ఎంపికయ్యారు.

## బిఆర్‌డి ఆస్పత్రిచే గుడివంకలో ఉచిత వైద్య శిబిరం

కుప్పం, జూలై 27 ప్రభాతవార్త

గుడుపల్లె మండలం గుడివంక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయ ప్రాంగణం వద్ద కుప్పం బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధ్వర్యంలో ఆది,సోమవారాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు తెలిపారు. ఆడికృతిక సందర్బంగా స్వామివారి దర్శనార్థం లక్షలాది భక్తులు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలనుంచి విచ్చేయనున్న నేపథ్యంలో ఆనవాయితీగా తమ ఆస్పత్రి తరపున ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల సౌకర్యార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్సీ డా॥ కంచర్లచే రైతుకు 1.23లక్షల చెక్కు అందజేత

కుప్పం, జూలై 27 ప్రభాతవార్త



ఏనుగుల దాడిలో పంటలు కోల్పోయిన రైతుకు ప్రభుత్వ అటవీశాఖ తరపున ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ రూ 1.23లక్షల చెక్కును శనివారం పంపిణీ చేశారు. మండలంలోని పైపాళ్యం పంచాయతీకి చెందిన సుబ్రమణ్యం అనే రైతు పంటలు ఏనుగుల దాడిలో గతంలో ధ్వంసం కాగా అటవీశాఖకు బాధిత రైతు పరిహారం కోసం బాధిత రైతు ఆశ్రయించాడు. దీంతో అతనికి ప్రభుత్వం తరపున పరిహారం మంజూరు కాగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ అందించారు. కార్యక్రమంలో రేంజర్ శివశంకర్, మాజీ సర్పంచ్ వల్లెప్ప పాల్గొన్నారు.

## రేపు సీజ్ చేసిన వాహనాల వేలం

కుప్పంరూరల్, జూలై 27 ప్రభాతవార్త

కుప్పం సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 29వతేది ఉదయం 11గంటలకు బహిరంగవేలం వేయనున్నట్లు సెబ్ సిఐ సృజన్‌బాబు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్,పాన్‌కార్డు నకళ్లతో 29వతేది ఉదయం 10గ ంటల్లోగా సెబ్ స్టేషన్‌లో 5వేల ధరావత్తు సొమ్ము చెల్లించి ఎంట్రీపాసు పొందాలన్నారు. వేలంలో దక్కి ంచుకున్న వాహనాలకు అదేరోజు మొత్తం నగదును 18శాతం జిఎస్టీతో సహా చెల్లించి వాహనాలు పొందాలని పేర్కొన్నారు.

## 1న ఇళ్ల వద్దకే పెన్షన్లు పంపిణీ

కుప్పంరూరల్, జూలై 27 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఆగస్టు 1వతేది లబ్దిదారుల ఇళ్ల వద్దకే నేరుగా పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఓ ఖాదర్ బాషా తెలిపారు. మండలంలో ఆగస్టు నెలకు సంబంధించి మొత్తం 14637పెన్షన్లకు గాను రూ 6,29,51500కోట్ల రూపాయలు ప్రభుత్వ సిబ్బంది ద్వారా పింఛనుదారులకు నేరుగా అందించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ముందస్తుగా దండోరా వేయించడంజరుగుతుందన్నారు.పింఛనుదారులుఆగస్టు1నపెన్షన్లకు తప్పక తీసుకోవాలని ఆయన కోరారు.

## ద్రవిడ వర్సిటీ ఎపిఆర్‌ఓగా నరేష్ నియామకం

కుప్పం, జూలై 27 ప్రభాతవార్త

ద్రవిడ విశ్వవిద్యాలయం సహాయ పబ్లిక్ రిలేషన్స్ అధికారిగా డా॥ నరేష్‌ను వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం.దొరస్వామి నియమించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ తనకు ఎపిఆర్‌ఓగా బాధ్యతలు అప్పగించిన వర్సిటీ విసి ఆచార్య ఎం.దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్బంగా డా॥ నరేష్‌ను వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, స్కాలర్లు అభినందించారు.

## విద్యార్థులకు పోటీతత్వం, సృజనాత్మకతపై శిక్షణ



**చిత్తూరురూరల్, జూలై 27 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం, విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ, నాంది ఫౌండేషన్ మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ సంయుక్తంగా ఆరు రోజుల పాటు 300మంది విద్యార్థినులకు పోటీతత్వం, సృజనాత్మకతను పెంపొందించుకోవడం అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహించినట్లు విజయం విద్యాసంస్థల అధినేత డా.ఎం.తేజోమూర్తి తెలిపారు. విద్యార్థినులు పోటీ ప్రపంచంలో విజయం సాధించడానికి కావలసిన మౌఖిక నైపుణ్యం, భావ వ్యక్తీకరణ, సాఫ్ట్‌స్కిల్స్ ప్రదర్శన నైపుణ్యం, ఉద్యోగ నిర్వహణ తదితర అంశాలపై ప్రతిరోజు 6గంటలు పాటు ఈనెల 22వ తేది నుంచి 27వ తేదివరకు నాందిపౌండేషన్ మహేంద్ర ప్రైడ్ క్లాస్‌రూమ్ బృందం గీత,పవన్, గణేష్, శరత్, జీవన్, తపస్విలచే శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు.

## శాస్త్రససోక్తంగా కమలాంజనేయస్వామికి ఆకుపూజ

చౌడేపల్లి, జూలై 27 ప్రభాతవార్త



స్థానిక కమలాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆకుపూజను శాస్త్రసోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకం, ఆంజనేయస్వామికి ప్రీతిపాత్రమైన తమలపాకులతో పూజగావించారు. ఆప్రాంతం నుంచి కాకుండా ఇతర ప్రదేశాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు తీర్చుకొన్నారు. వారికి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

చౌడేపల్లి, జూలై 27 ప్రభాతవార్త



విద్యార్థులకందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. శనివారం ఆయన స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనంలో నిబంధనలు పాటించాలని, ముఖ్యంగా పారిశుద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులు, పాఠశాలల మౌళిక వసతులకు పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలు పర్యవేక్షించారు తేదేపా సీనియర్ నాయకుడు ఆవుల రామచంద్రయ్య, పంజానిపల్లి బాబునాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, బోయకొండ సుబ్బు, పవన్‌కుమార్, ఎంఇఓ కేశవరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, పలువురు తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతో పర్యావరణ కాలుష్య నివారణ

–శిక్షా సప్తాహ జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్

తవణంపల్లె, జూలై 27 ప్రభాతవార్త



మొక్కల పెంపకంతో పర్యావరణ కాలుష్య నివారణ సాధ్యపడు తుందని జిల్లా శిక్షా సప్తాహ జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.వెంకట్రామరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో విద్యార్థులు తల్లితో కలసి మొక్కలు నాటే కార్యక్రమంను చేపట్టారు. ఇందులో భాగంగా తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ-2 త్యాగరాజులురెడ్డి, హెచ్‌ఎం దేవరాజులురెడ్డి, ఎంఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## 30న అరగొండలో ఆడికృత్తిక మహోత్సవాలు

తవణంపల్లె, జూలై 27 ప్రభాతవార్త:

మండలంలోని అరగొండలో వెలసిన శ్రీస్వయంభువనేశ్వర కుమారస్వామి దేవస్థానంలో ఈనెల 29,30 తేదీల్లో ఆడికృత్తిక ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మవిభూషణ్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి, గ్రామస్థులు తెలిపారు. ప్రతి ఏటా ఆలయంలో రెండు రోజుల పాటు ఆడికృత్తిక ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆలయ ధర్మకర్త పద్మవిభూషణ్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 29న భరణి వేడుకలు,30న ఆడికృత్తిక, కావడి చెల్లింపులు, రాత్రి పుష్పపల్లకి సేవ ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్బంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ప్రముఖ కళాకారులచే హరికథలు, బుర్రకథలు, భక్తి సంకీర్తనలు, చెక్కభజనలు, కోలాటాలు, వివిధ రకాల వేషధారణలు, పలు రకాల వాయిద్యాలు వంటి పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్‌ల ఉద్దేశం



– ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

గుడిపాల, జులై 27 ప్రభాతవార్త:

ఆకలిగా వున్న వారి ఆకలి తీర్చడమమే అన్న క్యాంటీన్ల ఉద్దేశమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అన్నారు. గుడిపాల మండలంలోని అన్న క్యాంటీన్‌ను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు శనివానం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని ఈ విషయం గ్రహించిన సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మూసి వేసిన అన్న క్యాంటీన్లను ప్రభుత్వం పునరుద్దరిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు అనిల్‌కుమార్, హేమాద్రినాయుడు, జనసేన రూప్‌కుమార్, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో పక్కాగా పారిశుధ్యం

– మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశం



**చిత్తూరుటౌన్, జులై 27 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలో క్షేత్ర స్థాయిలో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ శనివారం కట్టమంచి, లాయర్స్ కాలనీ, తిరుపతి రోడ్డుల్లో తనిఖీలు నిర్వహించి పారిశుధ్యం పనులు, నీటి సరఫరా, విధీ దీపాల నిర్వహణ తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని, ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, డిఇలు వెంకటప్రసాద్, రమణ, ఎఇలు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**గుడిపాల, జులై 27 ప్రభాతవార్త:** మండలంలోని బొమ్మసముద్రం సిపిఎఫ్ ఫ్యాక్టరీ వెనుకభాగంలోని అటవీ ప్రాంతంలో కుళ్ళిన మృతదేహం వున్నట్లు స్థానికులు గుర్తించారు. ఈ విషయంను స్థానికులు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ నరేంద్రకుమార్ అక్కడికి చేరుకుని మృతదేహంను పరిశీలించారు. మృతుడు మృతి చెంది ఎక్కువ రోజులు కావడంతో దుర్వాసన వస్తుండటంతో మృతదేహం సమీపంలోకి వెళ్ళడానికి స్థానికులు నిరాకరించారు. ఓ బిచ్చగాడు తిరుగులాడుతుండటంతో మతిస్థిమితం లేకుండా అతను ఇక్కడికి వచ్చి మృతి చెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాబ్‌మేళా విజయవంతం

పాలసముద్రం, జులై 27 ప్రభాతవార్త:



నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ నేతృత్వంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు ఆధ్వర్యంలో శనివారం రేవా రిసార్ట్ ఆవరణలో నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతం అయ్యింది. ఈ జాబ్‌మేళాను అమరరాజా బ్యాటరీస్, రాయల్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీల హెచ్‌ఆర్‌లు రామ్మూర్తి, ఈశ్వర్‌రావులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ జాబ్ మేళాకు మొత్తం 140 మంది యువకులు హాజరైతే వీరిలో 84 మందికి కంపెనీ ప్రతినిధులు ఉపాధికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా భీమినేని చిట్టిబాబునాయుడు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఎవరైనా నిరుద్యోగులు వుంటే వారు ప్రతి సోమవారం అమరరాజ బ్యాటరీస్ నిర్వహించే జాబ్ మేళాకు హాజరై ఉద్యోగం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వాసునాయుడు, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, బాబునాయుడు, అరుళ్‌నాథన్, రవినాయుడు, కుప్పరాజు, వవియ్‌కుమార్‌నాయుడు, తంగరాజు, నాగరాజు, సాంబశివన్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఘనంగా అబ్దుల్ కలాం వర్ధంతి

సూళ్లూరుపేట, జూలై 27 ప్రభాతవార్త



మిసైల్‌మెన్, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్‌కలాం వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని అబ్దుల్ కలాం కాంస్య విగ్రహానికి ఘనంగా నివాళి అర్పించారు. ఇస్రో ఉద్యోగి అప్పారావు మాట్లాడుతూ అబ్దుల్ కలాం జీవిత కథను, మిసైల్‌మెన్‌గా ఆయన చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షుడైన ఉస్మాన్‌బాషా మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆశయాలు అన్నీ సూక్తుల్లో దాగి ఉన్నాయని, ప్రతి సూక్తి విద్యార్థుల ఉన్నతికి సోపానంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్రో మాజీ ఉద్యోగి శ్యామ్, ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు చలపతి, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ అధ్యక్షుడుగా తిరుమూరు సుధాకర్‌రెడ్డి

సూళ్లూరుపేట, జూలై 27 ప్రభాతవార్త



సూళ్లూరుపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడుగా సీనియర్ రొటేరియన్, మాజీ రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ తిరుమూరు సుధాకర్‌రెడ్డి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక అలవలవారి రోటరీ కంటి ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రోటరీ నూతన కార్యవర్గంతో పాటు ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రోటరీ సేవలు గత 30 సంవత్సరాలుగా సూళ్లూరుపేట ప్రాంతంలో అందిస్తున్నామని, ఇందులో భాగంగా తిరిగి తనను రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఉండాలని సహచర రొటేరియన్లు విజ్ఞప్తి చేయడంతో తిరిగి ఆ బాధ్యతలు తీసుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు దశరథ్, వేనాటి ధనంజయరెడ్డి, డాక్టర్ సాయిబాబా, అలవల సుధాకర్‌రావు, కొండా రామకృష్ణ, ఎం.వినయసాగర్, వేనాటి శివకుమార్‌రెడ్డి, సుంకర ప్రతిమ, వేనాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1న పింఛన్ల పంపిణీ

– ఎంపిడిఓ విజయకుమార్

తడ, జూలై 27 ప్రభాతవార్త

ఆగస్టు 1న జరిగే పింఛన్ల పంపిణీలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉత్సాహంగా పాల్గొనాలని తడ ఎంపిడిఓ ఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం పింఛన్లు అన్ని ఒకే రోజు పంపిణీ చేసేందుకు తగిన సూచనలిచ్చారు. జాగ్రత్తలు తెలియజేశారు.పంచాయతీకార్యదర్శులు,మండలంలోనివెల్ఫేర్‌అసిస్టెంట్లు అందరు ఈ సమావేశంలో పాల్గొన్నారు

## ఘనంగా మిసైల్‌మెన్ అబ్దుల్‌కలాం వర్ధంతి

చిట్టమూరు, జూలై 27 ప్రభాతవార్త



చిట్టమూరు మండలంలోని టిఎంఆర్ పాఠశాలలో శనివారం మిసైల్‌మెన్, మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్‌కలాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎంఆర్ పాఠశాలలో విద్యార్థులు, డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు అబ్దుల్‌కలాంకు నివాళి అర్పించారు.ఈసందర్భంగాపాఠశాల డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అబ్దుల్‌కలాం గొప్పతనం, ఆయన చేసిన సేవలు, ఆయన జీవితం గురించి విద్యార్థులకు తెలియజేశారు. అబ్దుల్‌కలాం చాలా పేదస్థాయి నుంచి జాతీయ స్థాయి, రాష్ట్రపతి, గొప్ప సైంటిస్ట్‌గా ఎదగడానికి చదువు ఒక్కటే కారణమని తెలియజేశారు. విద్యార్థులు అందరూ బాగా చదువుకొని అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాములమిట్టలో శిక్షా సప్తాహ విద్యా వారోత్సవాలు

**తడ, జూలై 27 ప్రభాతవార్త** తడ మండలం పాములమిట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం శిక్షా సప్తాహ విద్యా వారోత్సవాలు నిర్వహించారు. 6వ రోజు కార్యక్రమంలో భాగంగా పర్యావరణ క్లబ్ ఏర్పాటు, అమ్మ పేరుతో మొక్కను నాటే కార్యక్రమాన్ని జరిపారు. మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున్‌రావు పాఠశాలలో ఎకో గ్రీన్ క్లబ్‌ను ఏర్పాటు చేసి పిల్లల చేత 35 మొక్కలు నాటించారు. ఆ మొక్కలను వివిధ తరగతుల విద్యార్థులకు ఎకో క్లబ్ ద్వారా దత్తత తీసుకునే విధంగా మొక్కలు పెంపకానికి పిల్లల సహకారం తీసుకున్నారు. పాఠశాల పిల్లల తల్లిదండ్రులు, సిఆర్‌ఎంటి మునుస్వామి, హెడ్మాస్టర్ షేక్ ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు వచ్చాయ్

కోట, జూలై 27 ప్రభాతవార్త

గత వైసీపీ పాలనలో పూర్తిగా గాడితప్పిన విద్యావ్యవస్థను సక్రమమైన మార్గంలో పెట్టేందుకు ఎన్డీఏ ప్రభుత్వం వేసిన తొలి అడుగు పడింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేరుస్తూ 40 రోజుల వ్యవధిలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేసేందుకు సిద్ధం చేసింది. ఆ మేరకు కోట మండలం చిట్టేడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోటలోని ఎవికెఆర్ జూనియర్ కళాశాలలకు పాఠ్య పుస్తకాలను అందజేసినట్లు ఎంఇఓ మస్తానయ్య తెలిపారు.

## ప్రభుత్వం దృష్టికి విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలు తీసుకెళ్లాలి

కోట, జూలై 27 ప్రభాతవార్త



11వ వేతన సవరణ కమిషన్ జూలై 1, 2018 నుంచి 2021 మధ్య పదవీ విరమణ చేసిన రిటైర్డ్ ఉద్యోగులకు రూ.12 లక్షలు నుంచి రూ.16 లక్షలు వరకు గ్రాట్యుటీ ఇవ్వాలని రాష్ట్ర విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సిఆర్‌టియు నాయకులు గిరిప్రసాద్‌రెడ్డి, జిల్లా నాయకులు కందాటి రామిశెట్టి, ఉపాధ్యక్షులు పివిఎస్ నారాయణరావు, కార్యదర్శి మహేశ్వరయ్య, వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు మాజీ ఎంఎల్‌సి శ్రీనివాసులునాయుడుకు వినతిపత్రం అందజేసి, ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## నిత్యావసర వస్తువులు పంపిణీ

గూడూరు, జులై 27, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని సనత్ నగర్ ప్రాంతంలో ఏర్పాటై ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. పొనకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొనకా మల్లికార్జున రెడ్డి దాతగా వ్యవహరించారు. ఈ సందర్భ సంస్థ అధ్యక్షుడు కడి వేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి నెల పేదలకు సరుకులు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో కాటూరి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్రభాకర్, రాము, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, పిల్లెల శ్రీనివాసులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నిర్మూలించాలి

గూడూరు, జులై 27, ప్రభాతవార్త



బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సిడిపిఓ మెహబూబి తెలిపారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గూడూరు పట్టణంలో అంగన్ వాడి కార్యకర్తలు, సిబ్బంది పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మెహబూబీ మాట్లాడూతూ బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జ్యోతి, కిరణ్, సూపర్‌వైజర్లు చెంచులక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సాగు పద్ధతులపై అవగాహన

చిల్లకూరు, జులై 27, ప్రభాతవార్త



చిల్లకూరు మండలంలోని తొనుకుమాల రైతు సేవా కేంద్రం పరిధిలో జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ ఎం. భాస్కరయ్య ఆధ్వర్యంలో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సి న సాగుపద్ధ తులను గురించి రైతులకు వ్యవసాయంలో పలు సూచనలను అందించారు. ఈ సదస్సు లో ఏడిఏ మాట్లాడుతూ స్వల్పకాలిక రకాలకు ప్రాధాన్యతిస్తూ, రసాయనిక ఎరువులకు బదులుగా నానో ఎరువుల వినియోగం సమగ్ర నీటి, కలుపు యాజమాన్యం పాటిస్తూ రసం పిల్చే పురుగుల బెడద నివారణ, సేంద్రియ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్స హించి రైతులు పచ్చి రొట్టె ఎరువులు విరివిగా వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఏడిఏ గోపినాయక్, జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణు గోపాల్, మండల వ్యవసాయ అధికారిని భవాని, అన్నంబాక గ్రామ సర్పంచ్ మల్లికార్జున్ రెడ్డి, టిడిపి నాయకులు, గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపిడిఓకు వినతి

వాకాడు, జులై 27, ప్రభాతవార్త

వాకాడు మండల పరిధిలోని వాలమేడు గ్రామంలోని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులను నిరుపేదలకు కల్పించాలని శనివారం వాకాడు ఎంపిడిఓ వెంకటేశ్వర రావుకు వినతి పత్రం అందజేశారు. వాలమేడు గ్రామస్థులు ఎంపిడిఓను కలిసి తమకు గ్రామంలో కొందరు పనులు జరగనికుండా ఇబ్బంది పెడుతూ ఆటంకపరుస్తున్నారంటూ ఎంపిడిఓకు ఫిర్యాదు చేసారు. ఎంపిడిఓ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ నిబంధనలు ప్రకారం పనులు నిర్వహించి ఉపాధి పొందవచ్చని తెలిపారు.

## విధులు సమర్ధవంతంగా నిర్వహించిన తహశీల్దార్ పుల్లారావు

బాలాయపల్లి, జులై 27, ప్రభాతవార్త



ఎన్నికల విధులను తహశీల్దార్ పుల్లారావు సమర్ధవంతంగా నిర్వహించాలని సిబ్బంది కొనియాడారు. ఎన్నికల విధులు నిర్వహణ అనంతరం ఆయన సొంత జిల్లా పల్నాడు బదిలీ కావడంతో డిప్యూటీ తహశీల్దార్ శిరీష, సిబ్బంది సన్మానించారు. డిప్యూటీ తహశీల్దార్ శిరీషకు ఇన్చార్జి తహశీల్దార్ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఆదిశేషయ్య, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి

ప్రధానోపాధ్యాయులు ఎంవి నారాయణ

వెంకటగిరి, జులై 27, ప్రభాతవార్త



మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవి నారాయణ తెలిపారు. స్థానిక జడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ సప్తహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రీన్‌కోర్ వారి సహకారంతో మొక్కలు నాటించారు. పలు రకాల పళ్ళ మొక్కలను విద్యార్థులు చేత నాటించారు. ఈ కార్యక్రమంఓ సైన్స్ టీచర్స్ జి. హరిత బిఎన్ భారతి, సిహెచ్ వాణి, అనురాధ, విజయలక్ష్మి, ప్రసూనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు తోటల్లోనే నిమ్మ పూతను కాపాడుకోవాలి

కెవికె అధిపతి డాక్టర్ బిజి రాజులు

వెంకటగిరి, జులై 27, ప్రభాతవార్త

రైతులు నిమ్మ తోటల్లోనే పూతను కాపాడుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ బిజి రాజులు రైతులకు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు దగ్గవోలు గ్రామంలో నిమ్మలో వేసవిలో అధిక దిగుబడి రావడానికి పూత నియంత్రణ పద్ధతులు పై క్షేత్రస్థాయిలో ప్రదర్శన నిర్వహించారు. కెవికె ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డా. బి. గోవిందరాజులు నిమ్మలో పూత రావడానికి జిబ్బరెల్లిక్ అమ్లం యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అలాగే, జిబ్బరెల్లిక్ ఆమ్లంను రైతులకు పంచి, దానిని నీటిలో కలుపుకునే విధానాన్ని రైతుల పొలాల్లో చూపించి, తర్వాత దానిని పొలాల్లో పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో కెవికె సిబ్బంది డా. డి. తిరుపాల్, ఉద్యాన శాస్త్రవేత్త డా. ఐ. రాజీవన, మృత్తికా శాస్త్రవేత్త, ఉద్యాన అధికారి జి. ఆనంద్ రెడ్డి, నిమ్మ రైతులు పాల్గొన్నారు.

## ఏపీఆర్జేసి లెక్చరర్ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు

వెంకటగిర, జులై 27, ప్రభాతవార్త



వెంకటగిరి ఏపీఆర్జేసీ కళాశాలలో భౌతిక శాస్త్రం లెక్చరర్‌గా పనిచేస్తున్న వారణాసి దుర్గా ప్రసాద్‌కు ఢిల్లీకి చెందిన మ్యాజిక్ ఆఫ్ రికార్డు చేసినందుకు జీవసాపల్లి అవార్డు అందజేశారు. లెక్చరర్ దుర్గా ప్రసాద్ 33 సంవత్సరాలుగా సైన్స్, అంతరిక్షం, భూగోళం, అనేక ప్రాజెక్టులు చేశారు. దుర్గా ప్రసాద్ అవార్డు మున్సిపాల్ శారద బాయ్ చౌదరి, సిబ్బంది అభినందించారు.

## గోకుల్ చౌదరికి డాక్టరేట్

చిల్లకూరు, జులై 27, ప్రభాతవార్త



కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన టిడిపి మండల ఉపాధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వర్లు చౌదరి కుమారుడు పచ్చగోకుల్ చౌదరి బెంగళూరులోని గార్డెన్ సిటీ యూనివర్శిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎమ్మెస్సీ ఐటీలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం కర్ణాటక గవర్నర్ చేతుల మీదుగా తావార్ చాంద్ గాహ్లెట్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

# సంస్కృత వర్సిటీలో కార్గిల్ వీరసైనికులకు నివాళులు




తిరుపతి విద్య, జులై 27 ప్రభాతవార్త : జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో కార్గిల్ విజయ దివాస్ సందర్భంగా శుక్రవారం రాత్రి విశ్వవిద్యాలయ భరతమాత విగ్రహం ముందు దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన వీర సైనికులకు ఘనంగా నివాళులు అర్పించి, దేశభక్తిని చాటడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఆర్ఎస్ఎస్ ఆంధ్ర ప్రాంత ప్రచారక్ విజయాదిత్య, విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొ.జిఎస్ఆర్ కృష్ణమూర్తి, రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్ ఎస్. గోపాల్, నాబి సుబేదార్ కె. మధు, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ డా.ఎ. చందూలాల్ అందరూ కలిసి దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులకు నివాళులు అర్పించి, కొవ్వొత్తి వెలిగించి వందనం చేయడం జరిగింది. విజయాదిత్య మాట్లాడుతూ అందరూ కూడా దేశ భక్తి కలిగి, దేశం కోసం పనిచేయాలని సూచించారు. మన దేశాన్ని అఖండ భారతదేశంగా వికసిత్ భారత్‌గా తీసుకురావడానికి అందరూ కృషి చేయాలని వివరించారు. దేశంలో ఉన్నటువంటి విద్వేశాలు, ఉగ్రవాదం, ఇతర సమస్యలను పూర్తిగా పారద్రోలాలని, అందుకు యువతదేశభక్తి కలిగి ముందుకు సాగాలని సూచించారు. ఆర్మీ కెప్టెన్ ఎస్. గోపాల్ మాట్లాడుతూ నేను కార్గిల్ యుద్ధంలో పాల్గొనడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, సైనిక జీవనం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, దేశకోసం ప్రాణాలు ఇచ్చేటువంటి గొప్ప సంకల్పం కలిగిన వారు సైనికులని, అటువంటి ఉత్తమమైన, గౌరవప్రదమైన సైనిక ఉద్యోగాలకు అందరూ కూడా ఆసక్తి చూపిస్తూ, దేశ రక్షణక కొరకు ముందుకు రావాలని ఆయన సూచించారు. మధు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో పాల్గొనే అదృష్టం భారతదేశం తరపున లభించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని భారతదేశం కోసం పోరాటం చేయడం ఒక మధురానుభూతి అని వివరించారు. విద్యార్థులంతా కూడా చెడు మార్గాలను విడిచి పెట్టి, దేశ భవిష్యత్తు కొరకు సామాజిక బాధ్యత కలిగి దేశ సేవలో ముందుకు సాగాలని వివరించారు. వైస్ చాన్సలర్ ప్రొ. కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన వీర సైనికుల గొప్పతనాన్ని అందరికీ వివరిస్తూ ప్రతి ఒక్కరు కూడా దేశభక్తి కలిగి, దేశ సంరక్షణ కొరకు బాధ్యత కలిగి ముందుకు సాగాలని వివరించారు. యువత దేశ సంరక్షణలో భాగస్వామ్యం అయినప్పుడే దేశం ఇంకా ఉన్నతమైన స్థితికి వెళుతుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొని వచ్చినటువంటి ఆర్మీ రిటైర్డ్ కెప్టెన్ ఎస్. గోపాల్‌ని ఆర్మీలో నాభి సుబేదార్‌గా రిటైర్డ్ అయిన కె. మధుని ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని సిబ్బంది, విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, ప్రజలు పాల్గొని వీర సైనికులకు గౌరవ వందనం చేసారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

**-అమ్మ పేరుతో ఒక మొక్క'కు అనూహ్య స్పందన**

శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పర్యావరణ హితం కోసం పలు క్లబ్బులు ఏర్పాటు చేస్తున్నారని ఊరందూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం కూనాటి సురేష్ తెలిపారు. శనివారం 'అమ్మపేరుతో ఒక మొక్క' అనే కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శిక్షాసప్తాహ వారోత్సవాల్లో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహనతో జీవించడానికి ఏర్పడ్డ మిషనల్ లైవ్‌కోసం పాఠవాలలో నీరు, వ్యర్థాల నిర్వహణ, శక్తి, భూమి, గాలి, ఆహారం వెంటనే ఆరు రకాల ఏకో క్లబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 'అమ్మపేరుతో ఒక మొక్క' అనే నినాదంతో తమ తల్లిదండ్రులు కలసి విద్యార్థులు మొక్కలు నాటారు. స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న మొక్కలను, వృక్షాలను, తీగ జాతులను విద్యార్థులతో లెక్కించి వాటినఇ వచ్చే ఏడాదికి రెండింతలు చేస్తామంటూ వారితో ప్రతిజ్ఞచేయించారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రాణవాయువు ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు, వర్షాలకు పడేందుకు, విపత్తుల సమయంలో చెట్లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. క్రీడామైదానంలోచెట్లు నాటించి వాటి వాడుక భాషలో ఉన్న పేరుతో పాటు వాటిశాస్త్రీయ నామాలును బోర్డుపై రాయించి సంబంధిత ప్రతి చెట్టుకు వేలాడదీయడం జరిగిందన్నారు. విభిన్న ఆకారాల్లో ఉన్న పత్రాలను సేకరించి వాటికి రంగులుపూసి విద్యార్థులతో ప్రదర్శన చేయడం జరిగిందన్నారు. అనంతరం ప్రకృతి పరిరక్షణకు కొన్ని నాటకాలను కూడా వారితో వేయించడం జరిగిందనానరు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్‌బాబు, శాంతి, సుమతి, మురళీ, రజియా, రమేష్‌రెడ్డి, మల్లికార్జున మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## వేడుకగా నగరసంకీర్తన-భజనలతో హోరెత్తించిన భక్తిభావం



తిరుపతిటౌన్, జులై 27ప్రభాతవార్త:తిరుపతిపుణ్యక్షేత్రంలో ప్రతిశనివారం రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో భక్తిభావం చాటుతోంది. శనివారం వేకువ జామున రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండమనాటి సుబ్ర మణ్యంరెడ్డి, సుశీల,మునికుమారి, పద్మ, కల్పన, ఉషారాణి, భారత్, పార్వతి, ధనలక్ష్మి, నిర్మల వాసురెడ్డి, మునినాథరెడ్డి, కస్పాపద్మనాభం, శాంభోలు హరినాథ్, పోన్నాలజేజిరెడ్డి,నాగరాజు,. రాజశేఖర్‌రెడ్డి వాసు,సాయిరెడ్డి తదితరులు తిరునామం ధరించి భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## అబ్దుల్‌కలాం జీవితం ఆదర్శం-చిత్రపటానికి పుష్పాంజలి



తిరుపతిటౌన్, జులై 27ప్రభాతవార్త: మాజీరాష్ట్రపతి, అంతరిక్షశాస్త్రవేత్త అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శమని బిజెపి నాయకులు అన్నారు. కలాం జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమ ణ్యం యాదవ్, అక్కిపల్లి మునికృష్ణయాదవ్, జనార్దన్‌రెడ్డి, చెంగారెడ్డి,ఫణిభూషన్‌రెడ్డి తదితరులు పుష్పాంజలి ఘటించారు.

## శ్రీకాళహస్తి పైప్స్‌కంపెనీలో కార్మికుడు మృతి!

**మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి!**



శ్రీకాళహస్తిరూరల్, జూలై 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద నిర్వహిస్తున్న భారీ పరిశ్రమ శ్రీకాళహస్తి పైప్స్ లిమిటెడ్‌లో శనివారం ఉదయం జరిగిన ప్రమాదంలో కాపుగున్నేరికి చెందిన ఎం.ప్రసాద్(42) ఆకాల మృత్యువు పాల య్యాడు. అయితే ఈ సంఘటనలో మేనేజ్‌మెంట్ సకాలంలో స్పందించలేదని స్థానిక నాయకులు శివమెత్తారు. కంపెనీ మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యం అంటూ గ్రామస్థులు ధ్వజమెత్తారు. సంఘటన విషయం తెలిసిన వెంటనే శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్‌తో చర్చించారు. ఆయన ఆదేశాలతో శ్రీకాళహస్తిలోని ఆర్‌డిఓ రవిశంకర్‌రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. అలాగే ఆసుపత్రి మార్చురిలో మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాపుగున్నేరికి చెందిన ప్రసాద్ కొంత కాలంగా పైపుల లోడింగ్‌లో పని చేస్తున్నారు. శనివారం ఉదయం అదే కార్యక్రమంలో ఉండగా ప్రమాదవశాత్తు పైపుల కింద పడి మృత్యువు పాలయ్యాడు. మృతునికి భార్య,కుమారుడు,కుమార్తె ఉన్నారు.వారిలో ఓ బిడ్డ అంగవైకల్యం కల్గి ఉంది. ప్రసాద్ కూలి డబ్బుతోనే సంసారం నడుస్తుంది.పైపులు లోడింగ్ చేస్తుండగా ఈ సంఘటన జరిగింది.సంఘటన తెలిసిన వెంటనే బాధితులు సంఘటనా స్థలానికి చేరుకోవటంతో అక్కడి కాంట్రాక్టర్ సరైన సమాధానం చెప్పలేదని తెలిసింది. ఈ మేరకు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెటింగ్ కమిటి మాజీ ఛైర్మెన్ చెంచయ్యనాయుడు,మండల పార్టీ నాయకుడు కామేష్‌యాదవ్, బత్తిరెడ్డి, జగదీశ్వరరెడ్డిలు మాట్లాడుతూ మృతుడు ప్రసాద్ కుటుంబానికి మేనేజ్‌మెంట్ ఆదుకోవాలన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ప్రసాద్ మృతితో చుట్టుపక్కల గ్రామాల వారు అక్కడకు చేరుకోవటంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది.

## వెంకన్న సేవలో ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు.

ప్రభాతవార్త-తిరుమల

## కలెక్టర్‌ను కలసిన టిటిడి ఉద్యోగులు



టిటిడి ఉద్యోగసంఘాల నాయకులు ఆంజనేయులు, వెంకటముని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రభాతవార్త-తిరుపతిటౌన్

## స్నేహపూర్వకంగానే తొలి అడుగు

**-ఉద్యోగులతో కలసి బాధ్యతలు స్వీకరణ**

**-ఇదీ నూతన అదనపు ఈఓ వెంకయ్యచౌదరి నైజం**



తిరుమల,జులై 27ప్రభాతవార్తప్రతినిధి: ఐఆర్ఎస్ అధికారి అయిన చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తన హోదాను పక్కనపెట్టి స్నేహపూర్వక వాతా వరణంలో అటు అధికారులు ఇటు ఉద్యోగులతో కలసి టిటిడి అదనపుఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఇచ్చిన మాటపై నిలబడే సమర్థవంతమైన అధికా రిగా మంచి పేరుతెచ్చుకున్న ఆయన శనివారం దేవుని చెంత సేవకుడిగా భక్తుల సేవలో తరించేందుకు రావడం,అందరినీ ఆప్యాయంగా పలకరించి తానూ ఓ సేవకుడినని చెప్పకనే తెలిసేలా మెలిగారు. టిటిడి అదనపు ఈఓగా నియమితులైన వెంకయ్యచౌదరి శనివారం ఉదయం స్వామివారికి తలనీలాలు సమర్పించారు. కుటుంబసభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంలోనూ ,ఆలయం వెలుపల అధికారులతో, ఉద్యోగులతో కలసిపోయి మీలో ఒక్కడినేనే ఆనందం వెలిబుచ్చారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో కల్యాణ వెంకన్న



చంద్రగిరి, జూలై 27 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం దేవదేవుడైన శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారు తన దేవేరులు శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు రాజశేఖర్, ఆలయ సిబ్బంది సుబ్రమణ్యం, చెంగయ్య, ఘనాపాటి తిరువెంగాడం, డాక్టర్ ఉదయ్‌తేజ, జమేధర్ రమణయ్య పాల్గొన్నారు.

# 10 రోజుల్లో అందుబాటులోకి యాదమరి పిహెచ్‌సి : కలెక్టర్



చిత్తూరుటౌన్, జులై 27 ప్రభాతవార్త: యాదమరి పిహెచ్‌సి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న పిహెచ్‌సి పనులు పది రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. యాదమరి పిహెచ్‌సి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న పిహెచ్‌సి భవనంను శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి నూతనంగా నిర్మిస్తున్న సామాజిక కేంద్రంను త్వరితంగా పూర్తి చేయాలన్నారు. భవనంలో ప్రస్తుతం పంబ్లింగ్ పనులు జరుగుతుండటంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు నాణ్యంగా చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సామాజిక కేంద్రంలో నిర్మించిన అన్ని గదులను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌కు పూర్తి స్థాయిలో టైల్స్ వేయాలని, ఆసుపత్రికి వచ్చే పేషంట్లకు విధులు నిర్వర్తించే సిబ్బందికి, డాక్టర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, యాదమరి పిహెచ్‌సి డాక్టర్ సురేఖలు కలెక్టర్‌కు వివరిస్తూ యాదమరి పిహెచ్‌సికి రోజుకు వంద మంది ఓపికి వస్తారని, అలాగే పిహెచ్‌సిలో 24 గంటలు స్టాఫ్ నర్స్ అందుబాటులో వుంటుం దన్నారు. పిహెచ్‌సిలో ప్రస్తుతం ఒక డాక్టర్ వున్నారని, రోగులకు అవసరమైన మందులు పిహెచ్‌సిలో అందుబాటులో వున్నాయని, ఎలాంటి మందుల కొరత లేదని వివరించారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్తూరు-గుడియాత్తం రహదారిలో కాశిరాళ్ళ వద్ద పూర్తిగా దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డు మరమ్మత్తుకు అవసరమైన ప్రతిపాదనలు సత్వరం పంపాలని ఆర్అండ్‌బి ఎస్ఇ ఉమామహేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఇఇ స్టాంలీ జోన్స్, డిప్యూటీ డిఇ గోవర్దన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆలయాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ఆనవాళ్లు : ఎమ్మెల్యే



పిచ్చాటూరు, జూలై 27 ప్రభాతవార్త: దేవాలయాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ఆనవాళ్లు అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం మండలంలోని రామగిరి ప్రధాన రహదారి నుంచి వాలీశ్వర స్వామి దేవాలయం వరకు 1.2 కి.మీ నూతన నిర్మించిన తారు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తారు రోడ్డు నిర్మాణానికి 60 లక్షలు వ్యయం జరిగినట్లు వివరించారు. ఆడికృత్తిక ఉత్సవాలకు రోడ్డు సన్నదానికి కృషి చేసిన అధికారులను అభినందించారు. అస్తవ్యస్తంగా తయారైన ప్రతి రోడ్డును పునర్నిర్మాణం చేసి రహదారులకు పూర్వ వైభవం తేవడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. అందులో భాగంగానే టీపీ కోట రోడ్డు, హనుమంతాపురం రోడ్డు, కొత్త గొల్లకండ్రిగ నుంచి టీకే పురం వరకు గుట్టలో రోడ్డు, నీరువాయి, వేలూరు సబ్‌స్టేషన్ రోడ్లకు పునర్ వైభవం కల్పిస్తానన్నారు. ఆడికృత్తిక సందర్భంగా దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి సౌకర్యాలు లేకుండా దర్శన భాగ్యం కల్పించేందుకు ఆలయ అధికారులు, పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, మాజీ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ వెంకటేశులు నాయుడు, నాయకులు పద్దురాజు, పార్లమెంట్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షులు రవీంద్రనాయుడు, జయ చంద్రనాయుడు, రామచంద్రరాజు, రవినాయుడు, అరుళ్ ప్రకాష్, రాజేంద్రన్, గజేంద్రన్, చంద్రయ్య, వేలు నాయుడులు పాల్గొన్నారు.

## కుదిరి సర్పంచ్ అనుమానాస్పద మృతి



సూళ్లూరుపేట, జూలై 27 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలం కుదిరి గ్రామ సర్పంచ్ బుంగా చెంగయ్య (45) అనుమానాస్పద స్థితిలో శనివారం తెల్లవారుజామున రైలు పట్టాలపై శవమై కనిపించాడు. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బుంగా చెంగయ్య గతంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా కుదిరి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. వైసీపీకి చురుకైన కార్యకర్తగా మొన్నటి ఎన్నికల వరకు కష్టపడి పనిచేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచి ఇంట్లో వారికి కనిపించకుండా పోయినట్లు సమాచారం. శనివారం తెల్లవారు జామున రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి బుంగా చెంగయ్యగా నిర్ధారించారు. చెంగయ్య గ్రామంలో వివాదరహితుడుగా ఉంటూ తన పని తాను చేసుకుపోయేవాడని, కాగా అనుమానాస్పద స్థితిలో రైలు పట్టాలపై శవమై కనిపించడం పట్ల కుదిరి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుంగా చెంగయ్య మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి ఆవరణ మొత్తం కుదిరి గ్రామస్థుల రోదనలతో నిండిపోయింది. కుదిరి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. పలువురు వైసీపీ నేతలు చెంగయ్య కుటుంబాన్ని పరామర్శించారు.

## కాంటాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



గూడూరు, జులై 27 ప్రభాతవార్త : గూడూరు రైల్వే జంక్షన్‌లో రైల్వే కాంటాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు సెంట్రల్ కమిటీ రైల్వే కాంటాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఇచ్చిన పలుపు మేరకు శనివారం సిఐటియు నాయకులు గూడూరు రైల్వే జంక్షన్ స్టేషన్ మాస్టర్ పి. వెంకటేశ్వర రావుకు దీర్ఘకాలికంగా ఉన్న పలు డిమాండ్స్‌పై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలు నుండి రైల్వే స్టేషన్‌లో పారిశుద్ధ్య కార్మికులు సుమారు 35 డిపార్ట్మెంట్‌లో పర్మనెంట్ కార్మికులతో సమానంగా స్కిల్డ్, అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, కేటగిరిలలో విధులను నిర్వహిస్తూ రైల్వేలకు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది కోట్ల రూపాయిలు రైల్వేలకు ఆదాయం తెచ్చి పెట్టడంలో ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. చట్టబద్ధమైన కార్మిక చట్టాలను కాంటాక్ట్స్ ద్వారా అమలు చేయించే బాధ్యత అసలు యజమానిగా ఉన్న రైల్వే యాజమాన్యం అమలు చేయించడంలో తగు శ్రద్ధ కనబరచడం లేదని వారు తెలియజేశారు. తమ 31 డిమాండ్స్ పై ఈ నెల జూలై 29వ తేదీన రైల్వే డిఆర్ఎం ఆఫీసుల ఎదుట ధర్నా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ధర్నాలో రైల్వే కాంటాక్ట్ కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, బివి రమణయ్య, ఎస్. సురేష్, అడపాల ప్రసాద్, బి. చంద్రయ్య, ఎస్కే మున్నా, ఆసీమ్, శీను లు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రులను కలిసి సమస్యలు తెలిపిన ఎమ్మెల్యే



వెంకటగిరి, జులై 27 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రివర్యులు బిసి జనార్ధన్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు కింజరావు అచ్చెన్నాయుడుని కలిసి వెంకటగిరి నియోజకవర్గం లోని వెంకటగిరి, బాలాయపల్లి, సైదాపురం ప్రజలు ప్రయాణం పై ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. బాలాయపల్లి నుండి వెంకటగిరి వరకు, సైదాపురం నుండి దేగపూడి వరకు అత్యంత గోరంగా ఉన్న ఆర్అండ్‌బి రోడ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లారు. నియోజకవర్గంలోని రైతులకు 2014-2019 మధ్యకాలంలో తెలుగుదేశం ప్రభుత్వం రైతు పథకాలు ద్వారా ఇచ్చిన్నటు వంటి అన్ని రకాల పరికరాలను మళ్ళీ రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చమనాయుడుని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారు.

## అన్నదాన కార్యక్రమానికి భారీ విరాళం



పాకాల, జులై 27 ప్రభాతవార్త : పాకాల మండలం ఊట్లవారిపల్లి గ్రామంలో ఆనందగిరి కొండపై వెలసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవాలయంలో జరుగు ఆడికృత్తిక బ్రహ్మోత్సవంలో భాగంగా అన్నదానం చేయుటకుగాను చెన్నుగారిపల్లి పంచాయితీకి చెందిన బార్లీబంగ్లా వాస్తవ్యులు స్వర్గీయ కొత్తపల్లి మధునాయుడు కుమారుడు కొత్తపల్లి గౌతమ్ చౌదరి భారీ అన్నదాన కార్యక్రమంగాను 2 లక్షల 616 రూపాయిలు శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి గుడి నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సోంపల్లి చంద్రశేఖర్ నాయుడుకి అందజేయడం జరిగింది. ఎల్లవేళలా వారి వారి కుటుంబానికి ఆ దేవదేవుడి ఆశీర్వాదాలు ఉండాలని చైర్మన్ అన్నారు.

## నేటి నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు



సదుం, జూలై 27 ప్రభాతవార్త : సదుంలోని రేగల్లు రోడ్డులో శ్రీజైసీతారామ ఆశ్రమంలో వెలసిన శ్రీవల్లీదేవసేనసమేత సుబ్రమణ్య స్వామి వారి ఆలయంలో 28 నుంచి జూలై1 వరకు ఆడికృత్తిక మహోత్స వాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 28న ధ్వజారోహణం, హోమాలు ఉంటాయి. అదేవిధంగా సోమవారం భరణి కావిళ్లు ఏర్పాటు చేశారు. ఆరోజు మాజీ మంత్రి పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన భార్య స్వర్ణలతమ్మలు సుబ్రమణ్యస్వామి వారికి పట్టు వస్త్రాలు అందజేస్తారు. 30వ తేదీ మంగళవారం కృత్తిక కావిళ్లు, అనంతరం స్వామి వార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. 31 బుధవారం స్వామి వారి ఊరేగింపు, జూలై1న ధ్వజ అవరోహణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు ప్రతి యేటా జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వార్లకు కావళ్లు సమర్పిస్తుంటారు. కోర్కెలు కోరుకున్నవారికి తప్పక నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

## శ్రీవారి సేవకుల సేవలు అభినందనీయం

**-వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ తనిఖీల్లో అదనపు ఈఓచౌదరి**



తిరుమల,జులై 27ప్రభాతవార్తప్రతినిధి: వివిధ ప్రాంతాల నుండి విచ్చేసే భక్తుల్లో భగవంతుని చూస్తూ సేవలందిస్తున్న శ్రీవారి సేవకుల సేవలను ఆయన అభినందించారు. శనివారం ఉదయం నూతన అదనపు ఇఒగా బాధ్యతలు చేపట్టిన వెంకయ్యచౌదరి సాయంత్రం అధికారులతో కలసి వైకుంఠమ్ 1, 2క్యూకాంప్లెక్స్‌లను తనిఖీ చేశారు.

**మాట నిలుపుకున్న**

## సిఎం,డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం



తిరుపతిటౌన్, జులై 27ప్రభాతవార్త: సిపిఎస్ ఉద్యోగులపై గత వైసిపి ప్రభుత్వం నమోదు చేసిన కేసులను ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం ఎత్తివేస్తు న్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటన చేయడం సంతోషకరమని సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్రనాయకులు అన్నారు. సిపిఎస్ ఉద్యోగులపై కేసులు ఎత్తివేస్తూ అసెంబ్లీలో ప్రకటన చేయడం పట్ల శనివారం సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు చీర్లకిరణ్, వంకీపురం పవన్, మురళి, గుంటూరురేఖ, హేమంత్, మణికంఠ, చలపతి, సునీల్‌కుమార్‌యాదవ్, ధరణి కుమార్, గోపీకుమార్‌రెడ్డి, అంకయ్య, తేజస్విని, ఉష,భాను తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

శ్రీరస్తు శుభమస్తు



**శ్రీ సుబ్రమణ్యస్వామి దేవస్థానము**

రామగిరి గ్రామం, పిచ్చాటూరు మండలం, తిరుపతి జిల్లా, ఆం.ప్ర

**59వ సంవత్సరము**

**ఆడికృత్తిక తెప్పోత్సవ ఆహ్వానము**

రామగిర నందు గల శ్రీ ముత్తుకుమారస్వామి అనే శ్రీ సుబ్రమణ్యస్వామి వారికి ఆడికృత్తిక సందర్భంగా 28-07-2024 నుండి 30-7-2024 తేదీ వరకు పగలు అభిషేక పూజలు, రాత్రి తెప్పోత్సవములు జరుగును. కావున భక్తులందరూ విచ్చేసి తెప్పోత్సవ కార్యక్రములందు పాల్గొనగలరు.

పూజా కార్యక్రమ వివరములు:

28-7-24వ తేది ఉ॥ 9.00గం.ల నుండి 10గం.ల వరకు భరణి అభిషేకములు, భరణి తెప్పోత్సవము

29-7-24వ తేది ఉ॥ 9.00గం.ల నుండి 10గం.ల వరకు ఆడికృత్తిక అభిషేకములు, రాత్రి 7.00గం.ల నుండి 8.00గం.ల వరకు తెప్పోత్సవము

30-7-24వ తేది ఉ॥ 9.00గం.ల నుండి 10.00గం.ల వరకు రోహిణ నక్షత్రాభిషేకం, రాత్రి 7.00గం.ల నుండి 8.00గం.ల వరకు రోహిణి తెప్పోత్సవం.

రాత్రి 7.00గం.లకు స్వామివారి గ్రామోత్సవము దేవస్థానము వారిచే జరుపబడును.

| ఆలయ వంశపారంపర్య అర్చకులు | ఆలయ సిబ్బంది, గ్రామ ప్రజలు - రామగిరి | స్వామివారి సేవలో కార్యనిర్వహణాధికారిణి |
|---|---|---|

